
సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 31 । ఆగస్టు । 2023



తాడేరు వంతెన పూర్తి

భీమవరం శివారు గునుపూడి సౌత్‌డ్రెయిన్‌పై నిర్మించిన తాడేరు వంతెన నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. 8లో ▸



బ్యాంక్ ఉద్యోగి మోసం

అధిక వడ్డీ ఆశతో బ్యాంక్ ఉద్యోగికి రూ.3 కోట్లు అప్పు ఇచ్చి మోసపోయామంటూ మహిళలు ధర్మాజీగూడెం వచ్చిన ఎంపీ కె.శ్రీధర్‌కు మొరపెట్టుకున్నారు. 8లో ▸



చెరువులో విషప్రయోగం

సాయన్నపాలెంలోని ఓ రొయ్యల చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి విషప్రయోగం చేయడంతో రైతుకు నష్టం వాటిల్లింది. 8లో ▸

వేగంగా వసతులు

పశ్చిమగోదావరి జిల్లాలోని వైఎస్సార్ జగనన్న కాలనీల్లో అన్ని వసతులను కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలను వేగవంతం చేసింది. మొత్తం 630 లే అవుట్లలో ప్రధాన, అంతర్గత రోడ్లు, పైప్‌లైన్, విద్యుత్ పనులకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. రూ.240 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులు ప్రస్తుతం ముమ్మరంగా సాగుతున్నాయి.

- జగనన్న కాలనీల్లో చురుగ్గా మౌలిక సౌకర్యాల కల్పన
- జిల్లాలోని 630 లేఅవుట్లలో రూ.240 కోట్లతో పనులు
- రోడ్లు, పైప్‌లైన్, విద్యుత్ పనులకు అధిక ప్రాధాన్యం
- పెద్ద లేఅవుట్‌లలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ల ఏర్పాటు





ఆకివీడు మండలం కుప్పనపూడి జగనన్న కాలనీలో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసిన దృశ్యం, (ఇన్‌సెట్‌లో) యలమంచిలి లేఅవుట్ వద్ద నిర్మించిన కల్వర్టు

భీమవరం (ప్రకాశం చౌక్): వైఎస్సార్ జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో ఇళ్లు నిర్మించుకుంటున్నారు. చాలా వరకు లబ్ధిదారులు నిర్మాణం పూర్తి చేసుకుని గృహప్రవేశాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా కాలనీల్లో మౌలిక వసతుల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలను వేగవంతం చేసింది. జిల్లాలో మెరక పనులు పూర్తి చేసి ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న లేఅవుట్‌లలో కూడా మౌలిక వసతుల్లో భాగంగా ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్లు, పైప్‌లైన్, వీధి దీపాల తదితర సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు అన్ని రకాల మౌలిక వసతులు ఉండేలా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. జగనన్న కాలనీలో మెరక పనులు, రోడ్లు, లైటింగ్, విద్యుత్ సబ్‌స్టేషన్‌లు తదితర అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నారు. పనులు వేగంగా జరిగేలా ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తున్నారు. పైప్‌లైన్ పనులు మినహా రూ.121 కోట్ల వ్యయంతో మొత్తం 439 పనులను చేపట్టగా, ఇప్పటికే 304 పనులను పూర్తి చేశారు.

• రూ.121 కోట్లతో 509 పనులు

జిల్లాలోని జగనన్న కాలనీల్లో రూ.121 కోట్లతో మౌలిక వసతుల పనులు చేపట్టారు. మొత్తం 509 పనులు చేపట్టగా, ఇప్పటివరకు 304 పనులు పూర్తి చేశారు. మిగిలిన పనులు వేగంగా జరుగుతున్నాయి.

• ప్రధాన రహదారులు

కాలనీల్లో ప్రధాన రోడ్ల నిర్మాణం కోసం రూ.12.41 కోట్లు ఖర్చు చేస్తున్నారు. మొత్తం 106 పనులు కాగా, ఇప్పటివరకు 86 పూర్తి చేశారు. 20 పనులు పురోగతిలో ఉన్నాయి.

• మెరక పనులు

జిల్లాలో మొత్తం 630 లేఅవుట్‌ల్లో కాగా మొదటి విడతలో రూ.44 కోట్ల వ్యయంతో 70 లేఅవుట్‌ల్లో మెరక పనులు చేపట్టారు. వాటిలో ఇప్పటికే 40 లేఅవుట్‌లలో పనులు పూర్తయ్యాయి.

• కల్వర్టుల నిర్మాణం

జగనన్న కాలనీల్లోకి రాకపోకలకు వీలుగా పంట కాలువలు, పంటబోదెలపై కల్వర్టులు నిర్మిస్తున్నారు. రూ.2 కోట్లతో 12 పనులు చేపట్టగా, వాటిలో 9 పనులు పూర్తి చేశారు. మిగిలిన 3 పనులు నిర్మాణ దశలో ఉన్నాయి.

• అంతర్గత రోడ్లు

జగనన్న కాలనీల్లో ప్రధాన రోడ్లతోపాటు అంతర్గత రోడ్లు నిర్మాణం చేస్తున్నారు. రూ.1.44 కోట్ల వ్యయంతో 14 పనులు చేపట్టారు. అందులో 5 పనులు పూర్తి చేయగా, 9 పనులు పురోగతిలో ఉన్నాయి.

• సిమెంట్ గోడౌన్లు

జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మాణం చేసుకునే వారు సిమెంట్, మెటీరియల్ భద్రపరుచుకోవడానికి వీలుగా మూడు చోట్ల రూ.15 లక్షలతో సిమెంట్ గోడౌన్స్ నిర్మించారు.

• వీధి దీపాలు

కాలనీల్లో విద్యుత్ వీధి దీపాల ఏర్పాటుకు సంబంధించి 234 పనులు చేపట్టగా, అందులో 161 పనులు పూర్తి చేశారు. ఇందుకు రూ.61 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇవి కాకుండా భీమవరం సమీపంలోని గునుపూడి, విస్సాకోడేరు, పైడిపర్రు, రుస్తుంబాద, కుప్పనపూడి వంటి పెద్ద లేఅవుట్‌ల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారు. వీటి ఏర్పాటు కోసం ఒక్కో సబ్‌స్టేషన్‌కు రూ.కోటి నుంచి రూ.3.50 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు.

• రూ.120 కోట్లుతో మంచినీటి పైపులైన్లు

కాలనీలో నివాసం ఉండే వారికి మంచినీటి సమస్య లేకుండా ప్రభుత్వం రూ.120 కోట్ల ఖర్చుతో మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టింది. 592 పైపులైన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.

యుద్ధప్రాతిపదికన చర్యలు



జిల్లాలోని జగనన్న కాలనీల్లో మౌలిక వసతులను కల్పించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నాం. జగనన్న కాలనీల్లో అప్రోచ్‌రోడ్లు, అంతర్గత రోడ్లు, విద్యుత్, తదితర 509 పనులు చేపట్టగా 304 పనులను ఇప్పటికే పూర్తి చేశాం. మిగిలిన పనులు వేగంగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. మంచినీటి పైప్‌లైన్ పనులు కూడా చురుగ్గా జరుగుతున్నాయి. ఇప్పటికే కాలనీల్లో నివాసం ఉంటున్న వారికి ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేస్తున్నాం.

– పి.ప్రశాంతి, జిల్లా కలెక్టర్

111 అడుగుల అన్నమయ్య విగ్రహం

నమూనాను ఆవిష్కరించిన మంత్రి కారుమూరి



విగ్రహావిష్కరణ అనంతరం శిల్పి కరుణాకర్‌ను అభినందిస్తున్న మంత్రి కారుమూరి

పెనుమంట్ర: వెంకటేశ్వరస్వామికి ప్రియభక్తుడైన తాళ్లపాక అన్నమార్యుల విగ్రహాన్ని అమెరికాలో నెలకొల్పడానికి శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉందని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. పెనుమంట్ర మండలం నత్తారామేశ్వరంలో ఏకే ఫైన్‌ఆర్ట్స్‌లో తయారు చేసే 111 అడుగుల పంచలోహ అన్నమయ్య విగ్రహానికి సంబంధించి ఆగమశాస్త్రం ప్రకారం మూడు రోజులుగా నిర్వహిస్తున్న సంప్రోక్షణ పూజా కార్యక్రమాలలో బుధవారం మంత్రి కారుమూరి నాగేశ్వరరావు హాజరయ్యారు. మట్టితో తయారు చేసిన నమూనా విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ అన్నమయ్య విగ్రహాన్ని అమెరికాలోని టెన్నెసె రాష్ట్రం కదంబవనంలో అక్కడి తెలుగువారు నెలకొల్పడానికి పూనుకోవడం అభినందనీయమన్నారు. మన ప్రాంత ఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాప్తి చేస్తున్న శిల్పి, ఏకే ఆర్ట్స్ అధినేత పెనుగొండ కరుణాకర్‌ను మంత్రి అభినందించారు. ట్రస్టు చైర్మన్ దుగ్గిరాల ప్రసాద్, పెనుగొండ కరుణాకర్, పెనుగొండ కేశవరావు దంపతులు హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రవాసాంధ్రులు పిల్లి బాలాజీ, కోక నీలిమ, పగడాల రజనీకన్నన్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కర్రసాము గోల్డ్ మెడలిస్ట్ మధుబాబుకు సన్మానం



మధుబాబుకు అంబేడ్కర్ చిత్రపటాన్ని అందిస్తున్న మాల మహానాడు నాయకులు

ముదినేపల్లి రూరల్: దక్షిణాసియా అంతర్జాతీయ పోటీల్లో కర్రసాములో బంగారు పతకం సాధించిన అందుగుల మధుబాబును రాష్ట్ర మాల మహానాడు విద్యార్థి విభాగం అధ్యక్షులు జక్కుల విజయకుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర మాలమహానాడు, అనుబంధ సంఘాల అధ్యక్షులు డాక్టర్ సేవా నాగజగన్ బాబురావు మాట్లాడారు. కలిదిండి సుగుణ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న మధుబాబు బెంగళూరులో ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు జరిగిన దక్షిణాసియా అంతర్జాతీయ పోటీల్లో కర్రసాము విభాగంలో శ్రీలంక క్రీడాకారుడిపై విజయం సాధించి బంగారు పతకం సాధించాదన్నారు. విజయవాడలో గురువు సత్యశ్రీకాంత్ వద్ద శిక్షణ తీసుకున్న మధుబాబు ఈ దేశ గౌరవాన్ని ఇనుమడింప చేశారని అభినందించారు. అనంతరం మధుబాబుకు అంబేడ్కర్ చిత్రపటాన్ని అందించి సత్కరించారు. కైకలూరు నియోజకవర్గ మాల మహానాడు అధ్యక్షుడు అందుగుల ప్రతాప్‌కుమార్, నాయకులు షేక్ గౌస్, బాపట్ల పైడేశ్వరరావు, అందుగుల మహిత, అద్దంకి కృష్ణ, గరికి ముక్కల రాజేష్, చిన్నారి పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించండి

సాక్షి, భీమవరం: పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్‌లో ఎన్ఆర్ డేటాను, పరీక్ష ఫీజులను చెల్లించాలని డీఈఓ వెంకటరమణ సూచించారు. ఆగస్టు 30వ తేదీ నుంచి సెప్టెంబర్ 15 వరకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. సెప్టెంబర్ 30వ తేదీ వరకు అపరాధ రుసుముతో చెల్లించాలన్నారు. www.bre.ap.org వెబ్‌సైట్‌లో పాఠశాల లాగిన్ ద్వారా మాత్రమే పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. సీఎఫ్ఎంఎస్ ద్వారా బ్యాంకు చలానాలు అంగీకరించబడవన్నారు.

క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో చండీహోమం



చండీహోమంలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో నెలవారీ జరిగే పూజల్లో భాగంగా శ్రావణమాసం, బుధవారం రాఖీపౌర్ణమి సందర్భంగా ఆలయంలో చండీహోమం నిర్వహించారు. ఆలయ అభిషేక పండిట్ భమిడిపాటి వెంకన్న బ్రహ్మత్వంలో ఈ హోమంలో 22 మంది దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

1, 2 తేదీల్లో ఆర్టీసీ పార్శిళ్ల వేలం

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ప్రజల అవసరాలకు అనుగుణంగా కార్గో సేవలు నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ సుబ్బారావు చెప్పారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత సంవత్సర కాలానికి సంబంధించి ఏలూరు, జంగారెడ్డిగూడెం డిపోల పరిధిలో 218 పార్శిళ్లను కస్టమర్లు తీసుకెళ్లలేదని తెలిపారు. పార్శిల్ ప్యాకెట్లు దానికి నిల్వ ఉన్న పార్శిల్స్‌లో బహిరంగ వేలం పాటను 1, 2 తేదీలలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటలకు ఏలూరు కొత్తబస్టాండ్ కార్గో సర్వీస్ కార్యాలయంలో ఈ బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్న వ్యాపారస్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

సెప్టెంబర్ వరకు ఓట్ల సవరణ

భీమవరం (ప్రకాశంచౌక్): ఓటర్ల సవరణ ప్రక్రియలో భాగంగా క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ స్వీకరణ సెప్టెంబర్ నెలాఖరు వరకు జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్‌లో డ్రాఫ్ట్ రోల్ పబ్లికేషన్ ఉంటుందని.. అంతవరకు సవరణ జరుగుతుందన్నారు. సెప్టెంబర్ మొదటి వారంలోగా పోలింగ్ స్టేషన్ల ఫైనలైజేషన్ చేయాలన్నారు. 1500 ఓటర్లు కన్నా ఎక్కువ మంది ఉన్న పోలింగ్ స్టేషన్లలో కొత్తవి ఏర్పాటు చేస్తామన్నారు. ఈ లోపుగా తహసీల్దార్లు అన్ని పోలింగ్ స్టేషన్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి చెక్ లిస్ట్ ఇవ్వాలన్నారు. సదరు మార్పులపై జిల్లా స్థాయిలో చర్చించి ఎన్నికల కమిషన్‌కు పంపుతామన్నారు.

రిజిస్ట్రేషన్లకు కొత్త సాఫ్ట్‌వేర్

సెప్టెంబరు 1 నుంచి అమలు



ఏలూరు కలెక్టరేట్‌లో రిజిస్ట్రార్ల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వి.రామకృష్ణ

ఏలూరు (టూటౌన్): సెప్టెంబరు ఒకటి నుంచి రాష్ట్రంలో రిజిస్ట్రేషన్‌లకు కొత్త సాఫ్ట్‌వేర్‌ను అమలు చేస్తున్నట్లు రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖ కమిషనర్ అండ్ ఇన్స్‌పెక్టర్ జనరల్ వి.రామకృష్ణ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని రిజిస్ట్రార్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఒకటో తేదీ నుంచి సరికొత్త కార్డ్ 2.0(కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్టుమెంట్) సాఫ్ట్‌వేర్ సాయంతో కార్యకలాపాలు జరుగుతాయన్నారు. ప్రజలు ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్లను సిద్ధం చేసుకుని చలానా కట్టొచ్చని చెప్పారు. వన్‌టైం స్లాట్స్ బుక్ చేసుకుని సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ లేదా గ్రామ, వార్డు సచివాలయానికి వెళ్తే రిజిస్ట్రేషన్ పూర్తవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టనున్న 2.0 విధానంపై అవగాహన కల్పించారు. సమావేశంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఏలూరు రేంజ్ డీఐజీ అబ్రహం, కార్డు డీఐ.ఈ రవీంద్రనాథ్, ఏలూరు జిల్లా రిజిస్ట్రార్ జయలక్ష్మి, ఆడిట్ డీఆర్ పార్వతి, పశ్చిమగోదావరి జిల్లా రిజిస్ట్రార్ రెడ్డి సత్యనారాయణ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని సబ్ రిజిస్ట్రార్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష కోసం సెప్టెంబరు 15లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యాంసుందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇప్పటికే నోటిఫికేషన్ వెలువడిందన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, వసతి సౌకర్యం లేని మోడల్ స్కూళ్లలో 8వ తరగతి విద్యార్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షల లోపు ఉండాలని, పరీక్ష రుసుము జనరల్, వెనుకబడిన విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.100, ఎస్సీ, ఎస్టీలకు రూ.50 చొప్పున చెల్లించాలన్నారు. ఈ పరీక్షకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబరు, 15 చివరి తేదీ కాగా, పరీక్ష రుసుము చెల్లించుటకు 16వ తేదీ చివర తేదీగా చెప్పారు. ప్రింటెడ్ నామినల్ రోల్స్, ధ్రువీకరణ పత్రాలు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించేందుకు 19వ తేదీ వరకూ అవకాశం ఉందన్నారు. జిల్లాలోని అన్ని రెవెన్యూ డివిజన్లలో డిసెంబర్ 3న పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్రానికి మొత్తం 4,087 స్కాలర్‌షిప్‌లను కేటాయించారన్నారు. గత సంవత్సరం జిల్లాలో ఉపకార వేతనాలు సాధించిన విద్యార్థులు 171 మంది ఉన్నారన్నారు. పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థికి సంవత్సరానికి రూ.12 వేలు వంతున ఉపకార వేతనం అందుతుందన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ కోరారు.

50 వేల గాజులతో అలంకరణ



గాజుల అలంకరణలో కనకదుర్గమ్మ

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రీరాంపురంలోని శ్రీచక్ర సహిత జగన్మాత కనకదుర్గ అమ్మవారికి 50 వేలు గాజులు, 5 వేల జాకెట్ ముక్కలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు బ్రహ్మజ్యోసుల ప్రసాద్, బ్రహ్మజ్యోసుల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత సుగంధ పరిమళ సుమంగళి ద్రవ్యంతో అభిషేకం, కలిదిండి వెంకటేశ్వరరాజు, రాధా దంపతులచే చక్ర అర్చన నిర్వహించారు. అమ్మవారికి 50 వేలు గాజులు, 5 వేల జాకెట్ ముక్కలతో ప్రత్యేక అలంకరణ చేశారు. గురువారం ఉదయం 8 గంటలకు భక్తులకు అమ్మవారి గాజులు, జాకెట్ ముక్కలు, పసుపు, కుంకుమ లను పంపిణీ చేస్తామని అర్చకులు తెలిపారు.

హెల్త్ క్లినిక్‌లు వేగంగా పూర్తిచేయాలి

కేఆర్‌పురంలో ఐటీడీఏ పాలకవర్గ సమావేశం



ఐటీడీఏ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: ఐటీడీఏ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసేలా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ హెచ్చరించారు. కేఆర్‌పురంలోని ఐటీడీఏలో బుధవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి, పీఓ ఎం.సూర్యతేజలు ఐటీడీఏ ద్వారా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల తీరుపై సమీక్ష నిర్వహించారు. గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ పనులపై కలెక్టర్ సమీక్షిస్తూ 15 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల పనుల జాప్యంపై ప్రశ్నించారు. వచ్చే నెల 15వ తేదీ లోగా వీటిని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. నాడు–నేడు పనులు కూడా నత్తనడకన కొనసాగుతుండడంపై గిరిజన సంక్షేమ శాఖ అధికారులపై కలెక్టర్ మండిపడ్డారు. పనితీరు మార్చుకోవాలని, లేనిపక్షంలో సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు.. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మాట్లాడుతూ గిరిజన ప్రాంతం అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. బుట్టాయగూడెం మండలానికి దగ్గరగా ఉన్న మోదేలు గ్రామ రహదారి నిర్మాణానికి ఫారెస్ట్ అనుమతులు ఇచ్చే విధంగా కృషి చెయ్యాలని బాలరాజు కలెక్టర్‌ను కోరారు. అందుకు స్పందించిన కలెక్టర్ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి ఆ సమస్య పరిష్కరించేలా చూడాలని ఫారెస్ట్ అధికారులను ఆదేశించారు.

మహిళా సాధికారతతో కుటుంబం వృద్ధి

ఉద్యానవర్సిటీ వీసీ టి.జానకీరామ్



మాట్లాడుతున్న వర్సిటీ వీసీ టి.జానకీరామ్

తాడేపల్లిగూడెం: మహిళ సాధికారత ద్వారా ఒక కుటుంబం వృద్ధి చెందుతుందని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ వీసీ డాక్టర్ తోలేటి జానకీరామ్ అన్నారు. వెంకట్రామన్నగూడెం కేవీకేలోని శిక్షణా కేంద్రంలో మహిళలకు ఎండుపూలతో ఉత్పత్తుల తయారీపై మూడు రోజుల పాటు ఇచ్చిన శిక్షణా కార్యక్రమం బుధవారం పూర్తయ్యింది. మహిళలకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ ఎండు పూల ఉత్పత్తుల తయారీ ద్వారా అధిక రాబడిని పొందవచ్చన్నారు. ఆర్నమెంటు ఫిష్ అక్వేరియం తయారీలో మెలకువలను మహిళలకు నేర్పామన్నారు. వర్సిటీ బోర్డు సభ్యురాలు సుమిత్ర, రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, విస్తరణ సంచాలకులు ఇ.కరుణశ్రీ పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు అండగా..

రక్షా బంధన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు చోట్ల మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులకు బుధవారం పలువురు అక్కాచెల్లెమ్మలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో మహిళల ఆర్థికాభ్యున్నతికి పెద్దపీట వేస్తూ అనేక పథకాలను అమలు చేస్తున్నారని ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్



తాడేపల్లిగూడెం: డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు



నరసాపురం రూరల్: చీఫ్ విప్ ప్రసాదరాజుకు రాఖీ కడుతున్న మహిళా ప్రజాప్రతినిధులు



తణుకు కల్చరల్: మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు రాఖీ కడుతున్న ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ చిట్టూరి సునంద



భీమవరం: భీమవరంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు రాఖీ కడుతున్న మహిళ



ఆకివీడు: డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజుకు రాఖీ కడుతున్న మాదివాడ మహిళ గోరి పుష్పావతి



పాలకొల్లు అర్బన్: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)కి రాఖీ కడుతున్న మహిళలు

క్లుప్తంగా

టీటీడీ బోర్డు చైర్మన్, ఈఓలను కలిసిన పెదబాబు




టీటీడీ చైర్మన్ కరుణాకర్ రెడ్డిని, టీటీడీ ఈఓ ధర్మారెడ్డిని సత్కరిస్తున్న పెదబాబు

నిడమర్రు : తిరుమల తిరుపతి దేవస్థానం నూతన బోర్డు సభ్యుడిగా నియమితులైన గాదిరాజు వెంకట సుబ్బరాజు (పెదబాబు) బుధవారం టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిని, ఈఓ ఏవీ ధర్మారెడ్డిని తిరుమలలోని వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని ఘనంగా సత్కరించారు. తిరుమలేశుని సేవ చేసుకొనే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, తనకు మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ పెదబాబు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు తిరుమలలో జరిగే టీటీడీ నూతన బోర్డు సభ్యుల ప్రమాణస్వీకారానికి వచ్చే పార్టీనేతలకు తగిన ఏర్పాట్లు చేసినట్టు పెదబాబు చెప్పారు.

ఓటర్ల జాబితా పరిశీలన

పెదవేగి : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్ల జాబితా మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని దెందులూరు నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జీవీ సత్యనారాయణ అన్నారు. బుధవారం ముండూరు, లక్ష్మీపురం, పెదవేగి, కూచింపూడి, రాట్నాలకుంట, దుగ్గిరాల గ్రామాల్లో తొలగించిన ఓటర్ల రికార్డులను పరిశీలించారు. ఆర్ఐ పి.రామకృష్ణ, టి.విద్యసాగర్ తదితరులు పాల్గొన్నారు.

తాడేరు వంతెన నిర్మాణం పూర్తి

- ఎమ్మెల్యే శ్రీనివాస్ కృషితో మూడు నియోజకవర్గాల ప్రజలకు ప్రయోజనం
- 10 రోజుల పాటు ట్రయల్ రన్
- త్వరలో ప్రారంభోత్సవం



గునుపూడి సౌత్ డ్రెయిన్ (తాడేరు)పై నిర్మించిన వంతెన



వంతెనపై ట్రయల్ రన్‌కు అనుమతి

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణ శివారు గునుపూడి సౌత్ డ్రెయిన్‌పై సుమారు రూ. 2.30 కోట్లు వ్యయంతో చేపట్టిన వంతెన నిర్మాణం పూర్తయింది. వంతెనకు రెండు వైపులా కంకరతో అప్రోచ్ రోడ్డు నిర్మించారు. వంతెనపై చిన్నచిన్న వాహనాల రాకపోకలకు 10 రోజులుపాటు అనుమతించారు. తరువాత బీటీ రోడ్డు పనులు పూర్తిచేసి భారీ వాహనాలకూ అనుమతిస్తారు. వంతెన నిర్మాణంతో భీమవరం, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాలకు చెందిన ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పట్టువీడని విక్రమార్కునిగా పనిచేయడంతో వంతెన నిర్మాణం త్వరితగతిన పూర్తిచేశారు. భీమవరం నుంచి నరసాపురం వెళ్లడానికి ప్రధాన రహదారి అయిన తాడేరు రోడ్డులో గునుపూడి సౌత్ డ్రెయిన్‌పై 1929లో వంతెన నిర్మించారు. ఈ వంతెన మీదుగా భీమవరం, నరసాపురం ఆర్టీసీ డిపోలకు చెందిన బస్‌లతోపాటు ధాన్యం, కొబ్బరి, రొయ్యలు, చేపల లోడు వాహనాలు, విద్యాసంస్థల బస్‌లు తిరుగుతుంటాయి. భీమవరం, పాలకొల్లు, నరసాపురం నియోజవర్గాలకు చెందిన సుమారు 30పైగా గ్రామాలు, అనేక ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ రోడ్డుపై ప్రయాణిస్తుంటారు. ఎంతో ప్రాధాన్యత గల ఈ రోడ్డులోని తాడేరు వంతెన గత ప్రభుత్వ హయంలోనే శిథిలావస్థకు చేరింది. అప్పట్లో వంతెన మధ్యలో రంధ్రం ఏర్పడడంతో తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారు. వంతెన నిర్మాణంపై అప్పటి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు దృష్టిపెట్టిన దాఖలాలు లేవు.

ఎమ్మెల్యే గ్రంధి ప్రత్యేక శ్రద్ధ

2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించిన గ్రంధి శ్రీనివాస్ శిథిలావస్థకు చేరిన వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టారు. రూ.1.90 కోట్లు నిధులు మంజూరు చేయించారు. అయితే పెరిగిన నిర్మాణ సామగ్రి ధరలు కారణంగా వంతెన నిర్మాణానికి కాంట్రాక్టర్స్ ముందుకురాలేదు. ఎమ్మెల్యే శ్రీనివాస్ ప్రత్యేక కృషితో తిరిగి అంచనాలు రూపొందించగా ప్రభుత్వం రూ.2.30 కోట్లు మంజూరు చేసింది. దీంతో వంతెన నిర్మాణ పనులకు ఈ ఏడాది ఏప్రిల్ 4న ఎమ్మెల్యే శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. కేవలం 5 నెలల వ్యవధిలో వంతెన నిర్మాణం పూర్తిచేశారు.

త్వరలో అందుబాటులోకి



తాడేరు వంతెన నిర్మాణం పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం ట్రయిల్ రన్‌కు అనుమతిచ్చాం. అప్రోచ్‌రోడ్డు పటిష్టం అయిన తరువాత బీటీ రోడ్డు వేసి త్వరలో ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తాం.
– ఎస్ లోకేశ్వరరావు, ఆర్అండ్‌బీ ఈఈ, భీమవరం

ఫైనాన్స్ కంపెనీ దౌర్జన్యంపై కేసు

నూజివీడు(ఆగిరిపల్లి): మండల కేంద్రమైన ఆగిరిపల్లికి చెందిన దేశిబోయిన ధనమ్మ అనే మహిళపై ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు దౌర్జన్యం చేసినట్టు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ధనమ్మ విజయవాడలోని చోళమండల ఫైనాన్స్ కంపెనీలో రూ.26 లక్షలు ఇంటి రుణం తీసుకుంది. ధనమ్మ ఇటీవల కొన్ని అనివార్య కారణాల వల్ల రెండు నెలల వాయిదాలు చెల్లించలేదు. దీంతో ఫైనాన్స్ కంపెనీ నుంచి విజయవాడలోని చిట్టినగర్ నివాసి అయిన గేదె సుబ్బరాజు (టీం లీడర్), ఒక లాయర్, మరికొందరు కలిసి ధనమ్మ ఇంటికి మంగళవారం వచ్చి నోటీసులు అంటించి ఇంట్లో వారిని వెళ్లిపోవాలని బెదిరించారు. ధనమ్మ తర్వాత చెల్లిస్తామని చెప్పినా వినకుండా బయటికి నెట్టేశారు. ధనమ్మ క్రింద పడిపోయింది. ఆమెకు గుండె నొప్పి వచ్చింది. ఆమెను కోడళ్లు హుటాహుటిన నూజివీడు గవర్నమెంట్ ఆసుపత్రికి తరలిచంగా అక్కడ వైద్య చికిత్స చేసి పోలీస్ స్టేషన్‌కి పంపిన ఇంటిమేషన్ రిపోర్ట్ ఆధారంగా ఏఎస్సై తావిర్యా నాయక్ కేసు నమోదు చేయగా, ఎస్సై నంబూరి చంటిబాబు దర్యాప్తు చేపట్టారు.

రూ.3 కోట్లతో పరారైన బ్యాంక్ ఉద్యోగి

ఎంపీ శ్రీధర్ వద్ద బాధితుల మొర



ధర్మాజీగూడెంలో బ్యాంక్ ఉద్యోగి మోసంపై ఎస్పీకి ఫోన్‌లో వివరిస్తున్న ఎంపీ కోటగిరి శ్రీధర్

లింగపాలెం: అధిక వడ్డీ ఇస్తానంటూ ఆశ చూపిన బ్యాంకు ఉద్యోగి రూ.3 కోట్లు తీసుకొని పరారయ్యాడంటూ బాధితులు ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ వద్ద మొరపెట్టుకున్నారు. బుధవారం వైఎస్సార్‌సీపీ ధర్మాజీగూడెం నాయకులు వి.ప్రసాద్ ఇంటికి వచ్చిన ఎంపీ శ్రీధర్‌కు ఇదే గ్రామానికి చెందిన పలువురు బాధిత మహిళలు కలిసి వినతిపత్రం అందజేశారు. ధర్మాజీగూడెం గ్రామంలో కొంతకాలంగా నివాసం ఉంటూ ఎస్‌బీఐ బ్యాంక్‌లో ఉద్యోగిగా పనిచేసిన బి.బాబురావు తమకు అధిక వడ్డీ ఆశచూపి తమ వద్ద రూ.3 కోట్లు తీసుకొని మోసం చేశాడంటూ డ్వాక్రా మహిళలు వివరించారు. 108 మంది వద్ద డబ్బులు తీసుకొని పరారయ్యాడన్నారు. బాబురావు ధర్మాజీగూడెం బ్యాంక్ నుంచి గత కొంత కాలం క్రితం లింగపాలెం ఎస్‌బీఐ బ్యాంక్‌కు బదిలీపై వెళ్లాడని తెలిపారు. ఆ సమయంలో డబ్బులివ్వమని అడుగగా కాలయాపన చేస్తూ వచ్చాడన్నారు. దీనిపై స్పందించిన ఎంపీ శ్రీధర్ ఏలూరు ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని ఎంపీ బాధితలుకు భరోసా కల్పించారు. ఎంపీ వెంట సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, రాష్ట్ర లెబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు, లిడ్‌క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొఠారి మోహన్, ములగలంపాడు సర్పంచ్ ఇనుగంటి రాజేష్, వైఎస్సార్ సీపీ నాయకులు ఈ సతీష్, ఏపూరి సూరిబాబు, కె.రఘు, కోటగిరి హరీష్ తదితరులు ఉన్నారు.

లోకేశ్‌వి అవగాహన లేని విమర్శలు

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



ఐటీడీఏ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు, తదితరులు

బుట్టాయగూడెం: అయోమయం గందరగోళ పరిస్థితుల్లో ఉన్న నారా లోకేశ్ సరైన అవగాహన లేకుండా పోలవరం ప్రాజెక్టు గురించి మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆరోపించారు. బుట్టాయగూడెం మండలం కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద బుధవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నారా లోకేశ్ ఒక శుంఠ అని, పప్పు అని ఆయన పాద్రయాత్ర ఎందుకు చేస్తున్నాడో తనకే తెలియదని అన్నారు. టీడీపీ హయాంలో పోలవరం ప్రాజెక్టుకు చంద్రగ్రహణం పట్టి పీడించిందన్నారు. ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురైందని, నిర్వాసితుల సమస్యలను గాలికి వదిలేశారని ఆరోపించారు. అయితే ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని, ప్రజలను మభ్యపెట్టి మోసం చేసి గద్దెనెక్కే ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. వెన్నుపోటుకు, దగాకు, కుట్రలు, కుతంత్రాలకు పేటెంట్ ఎవరైనా ఉన్నారంటే అది చంద్రబాబు నాయుడు అని అన్నారు. చంద్రబాబు తన హయాంలో రాష్ట్ర ప్రజలకు ఏ ఒక్క మేలైనా చేశారా అని ప్రశ్నించారు. చంద్రబాబునాయుడు మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, ఏ ముఖంతో ప్రజల ముందుకు వస్తున్నారో చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నేడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో, పాదయాత్రలో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేశారని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్నే ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని సర్వేలు చెబుతుండడంతో చంద్రబాబునాయుడు అండ్ కోకు మతి భ్రమించి ఏం మాట్లాడుతున్నారో అర్థం కావట్లేదని అన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉయికే బొజ్జి, జెడ్పీటీసీలు దాసరి శ్రీలక్ష్మి, మల్లం వసంతరావు, బుజ్జు రామలక్ష్మి, కలుము హేమకుమారి, ఎంపీపీలు కారం శాంతి, సుంకర వెంకటరెడ్డి, దేవి, డి.లక్ష్మి, ఎంపీటీసీ గాలి దుర్గారావు, సర్పంచ్‌లు ఎం.రామలక్ష్మి, కె.దుర్గ, బి.బుచ్చిరాజు పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమం



తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెం మండలం మోదుగగుంట గ్రామంలో వృద్ధుడికి అందిన సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ



ఆకివీడు : ఆకివీడు నగర పంచాయతీ 19వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారునికి పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఏలూరు టౌన్: ఏలూరు పాతబస్టాండ్‌లో ఒక వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. సుమారు 50 ఏళ్ల వయస్సు గల వ్యక్తి పాతబస్టాండ్ ప్రయాణికుల షెల్టర్‌లో బుధవారం సాయంత్రం మృతి చెంది ఉండటంతో ఆర్టీసీ కంట్రోలర్ వెంకట చంద్రమౌళి పోలీసులకు సమాచారం అందించారు. ఏలూరు టూటౌన్ సీఐ పి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

మహిళా కానిస్టేబుల్‌కు గాయాలు

ఓ మహిళా కానిస్టేబుల్ రోడ్డు దాటుతుండగా మోటారుసైకిల్‌పై వెళ్తున్న వ్యక్తి ఢీ కొనడంతో గాయాలయ్యాయి. ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న దేవి టి.నర్సాపురంలో లోకేశ్ పాదయాత్ర విధులు ముగించుకుని మంగళవారం రాత్రి ఏలూరు వచ్చింది. ఏలూరు అమీనాపేట చర్చి వద్ద రోడ్డు దాటుతుండగా మోటారుసైకిల్ ఢీకొట్టింది. తీవ్రగాయాలయిన ఆమెను ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు చికిత్స అందించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.

రొయ్యల చెరువులో విషప్రయోగం

రూ.40 లక్షల నష్టం



సాయన్నపాలెంలో విష ప్రయోగంతో తేలిపోయిన రొయ్యలు

భీమడోలు: పూళ్ల పంచాయతీ శివారు సాయన్నపాలెంలో ఓ రొయ్యల చెరువులో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు విషప్రయోగానికి తెగబడ్డారు. 10 టన్నుల రొయ్యలు మృతి చెందడంతో సుమారు రూ.40 లక్షల నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన సాగిరాజు కృష్ణంరాజుకు చెందిన ఏడెకరాల చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు ఎలుకల మందు జల్లడంతో ఫార్టీ కౌంట్ రొయ్యలు బుధవారం తెల్లవారుజామున నీటిపైకి తేలిపోయాయి. రైతు చెరువు చుట్టూ వెతకగా ఎలుకల మందు పొట్లాలు కనిపించాయి. వాటిని పోలీసులకు అప్పగించారు. బాధిత రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ కేసు దర్యాప్తు చేపట్టారు.

జేబు దొంగపై కేసు

ద్వారకాతిరుమల: శ్రీవారి పాదుకా మండపం వద్ద ఒక భక్తుడి జేబులోంచి నగదును తస్కరించిన వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ దుర్గారావు తెలిపారు. చినవెంకన్న దర్శనార్థం మండలంలోని లైన్ గోపాలపురం నుంచి ఆలయానికి విచ్చేసిన శనివారపు జానీ ముందుగా స్వామివారి పాదుకా మండపం వద్ద దండం పెట్టుకుంటున్నాడు. ఆ సమయంలో పెనమలూరు మండలం చోడవరంకు చెందిన పోరంకి అంజి అనే వ్యక్తి జానీ జేబులోంచి రూ.500 తస్కరించి, పరారయ్యేందుకు ప్రయత్నించాడు. అయితే అక్కడున్న మరికొందరు భక్తుల సాయంతో జానీ అతడిని పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. జానీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు హెచ్‌సీ దుర్గారావు తెలిపారు.

ఇసుక గుట్టల వద్ద ధర్నా విచారకరం



రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్

పాలకొల్లు అర్బన్: ఇసుక గుట్టల వద్దకెళ్లి టీడీపీ నేతలు ధర్నాలు చేయడం రాజకీయ దిగజారుడుకి నిదర్శనమని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ దుయ్యబట్టారు. యాళ్లవానిగరువులో ఆయన తన నివాసంలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. ఆగస్టు, సెప్టెంబర్‌లో గోదావరికి వరదలు కారణంగా ప్రభుత్వం ముందు చూపుతో వినియోగదారులకు ఇసుక కొరత లేకుండా ఇసుక నిలువ చేసిందని వివరించారు. అయితే ప్రభుత్వం ఇసుక అక్రమంగా అమ్ముకుంటుందని విమర్శిస్తూ టీడీపీ నేతలు కొత్త నాటకానికి తెరలేపారన్నారు. భవన యజమానులకు ఇసుక కొరత లేకుండా, కార్మికులకు ఉపాధి కల్పించాలనే ధ్యేయంతో ఇసుక నిలువ చేసిందని, దీన్ని టీడీపీ దుష్ప్రచారం చేయడం దారుణమని తెలిపారు. ప్రభుత్వాన్ని విమర్శించడానికి ప్రతిపక్షలకు అవకాశం లేకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని వివరించారు. నవరత్నాల పేరుతో లబ్ధిదారులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి సంక్షేమ వారధిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని అన్నారు. నారా లోకేశ్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్రకు జనం లేరన్నారు. గతంలో జన్మభూమి కమిటీల పేరుతో ఉచిత ఇసుక అంటూ అక్రమంగా ఇసుక దోచుకున్న విషయాన్ని గుర్తుచేశారు. టీడీపీ ఎమ్మెల్యేలు అప్పట్లో ఏడాదికి రూ.100 కోట్లకు పైగా అక్రమార్జన చేశారని విమర్శించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇసుక పాలసీని తీసుకువచ్చి వినియోగదారులకు ఇసుకను అందుబాటులోకి తీసుకొచ్చి వెసులుబాటు కల్పించారన్నారు.

ఉరివేసుకుని వివాహిత మృతి



దుర్గ మృతదేహం

కై కలూరు: ఇంటి దూలానికి ఉరివేసుకుని వివాహిత అనుమానాస్పద రీతిలో మృతి చెందిన ఘటన కైకలూరు మండలం ఆచవరం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఆచవరం పంచాయతీ పరిధి రోడ్డు సమీపంలో అత్తుల వెంకటేశ్వరరావు (35), దుర్గ (30) దంపతులు నివసిస్తున్నారు. వీరు చేపల పట్టుబడులకు వెళుతూ జీవనం సాగిస్తున్నారు. వీరికి మోహన్, రోహిత్ అనే కుమారులు ఉన్నారు. వీరు ఆచవరం స్కూల్‌లో 5, 6 తరగతులు చదువుతున్నారు. ఇటీవల కాలంలో భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో తరుచూ గొడవలు పడుతున్నారు. బుధవారం పిల్లలు బడికి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. తల్లి ఉరి వేసుకుని కనిపించింది. ఆ సమయంలో తండ్రి కూడా ఇంటిలోనే ఉన్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. వెంకటేశ్వరరావు మరో స్త్రీతో అక్రమసంబంధం పెట్టుకున్నాడని తరుచూ దుర్గ చెబుతుండేదని గణపవరం మండలం తరటం గ్రామం నుంచి వచ్చిన మృతురాలు తండ్రి, బంధువులు రోదిస్తూ చెప్పారు. వెంకటేశ్వరరావే తన కుతూరిని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రించాడని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కైకలూరు టౌన్ ఎస్సై ప్రతాప్‌రెడ్డి కేసు దర్యాప్తు చేపట్టారు.

భర్త వేధింపులపై కేసు

ఆకివీడు: భర్త వేధింపులు తట్టుకోలేక భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై ఫణి మోహన్ బుధవారం తెలిపారు. ఆకివీడులో నివాసం ఉంటున్న లంకే పార్వతికి బందురుకు చెందిన దశరథ రాముడుకు 13 ఏళ్ల క్రితం వివాహమైంది. పెళ్లి అయిన తరువాత కొన్నాళ్లు కాపురం సజావుగానే సాగింది. ఇద్దరు పిల్లలు పుట్టిన కొన్నేళ్లకు మద్యానికి బానిసైన రాముడు ప్రతి రోజూ కొట్టడం, మానసికంగా హింసించడంతో పార్వతి పోలీసులను ఆశ్రయించింది. భర్తతో పాటు అత్త, ఆడపడుచు వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది.

నేడు ఎంపీ మిథున్‌రెడ్డి పాలకొల్లు రాక

పాలకొల్లు అర్బన్: పార్లమెంట్ సభ్యుడు, ఉభయ గోదావరి జిల్లాల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి గురువారం పాలకొల్లు వస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) విలేకర్లకు తెలిపారు. పెదసాయిబాబా గుడి రోడ్డులోని అడబాల గార్డెన్స్‌లో ఉదయం 10.30 గంటలకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొంటారని పేర్కొన్నారు. పోడూరు, యలమంచిలి, పాలకొల్లు పట్టణ, మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి పార్టీ నాయకులు, వార్డు ఇన్‌చార్జిలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, అనుబంధ కమిటీలు పాల్గొనాలని కోరారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



దాత కుటుంబానికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ చైర్మన్ సుధాకరరావు

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు బుధవారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంకు చెందిన బోడపూడి వీరవెంకట రాఘవయ్య, ఉషారాణి దంపతులు కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఈ విరాళం చెక్కును ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావుకు అందజేశారు. దాత కుటుంబానికి విరాళం బాండ్ పత్రాన్ని చైర్మన్ అందించారు.

యానాం మద్యం సీసాల స్వాధీనం



మద్యం సీసాలతో ఎస్ఈబీ అధికారులు

పాలకొల్లు సెంట్రల్: అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న ఎస్ఈబీ అధికారులు తెలిపారు. బుధవారం పట్టణంలో నరసాపురం రోడ్డులో తనిఖీల్లో ఓ కారులో యానాంకు చెందిన 75 మద్యం సీసాలు ఉన్నట్లు గుర్తించామని ఎస్ఈబీ సీఐ ఎల్ చిరంజీవి తెలిపారు. కారులో ఉన్న చంద్రశేఖర్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశామని చెప్పారు. తనిఖీల్లో ఎస్ఈబీ ఎస్సై ఎస్‌కే ఖాసిం, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కపర్ధి పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి



కపర్ధి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సోమసుందర్

తాడేపల్లిగూడెం: కార్మికుల హక్కుల సాధన కోసం అమరజీవి కామ్రేడ్ కపర్ధి పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని ఏఐటీయుసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ పిలుపునిచ్చారు. సుప్రసిద్ధ కార్మిక నేత కపర్ధి శత జయంతి కార్యక్రమం బుధవారం జరిగింది. రాష్ట్రస్థాయిలో ఆర్టీసీ , మునిసిపల్,బ్యాంకు ఉద్యోగుల సంఘాల నేతగా కపర్ధి సాగించిన కృషి చిర స్మరణీయమన్నారు. ఈ సందర్భంగా పలువురు కార్మిక సంఘాల నేతలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళింగ లక్ష్మణరావు, సీహెచ్.వెంకటరమణ,కె.లక్ష్మీనారాయణ, పడాల శ్రీనివాసు, పెద్దకాపు, పాలూరి లక్ష్మణ రావు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన ధరలు తగ్గించాలి



పట్టణంలో ర్యాలీ చేస్తున్న నాయకులు

తాడేపల్లిగూడెం: కేంద్రంలో మోదీ అసమర్థత పాలన ఫలితమే సామాన్య ప్రజలపై మోయలేని భారాలనీ సీపీఎం నాయకులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా నిరుద్యోగం, విద్యుత్ చార్జీలు, అధికధరలకు నిరసనగా సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ ఎనిమిదేళ్లలో మోదీ ప్రభుత్వం పేదలను కొట్టి పెద్దలకు దోచిపెడుతుందన్నారు. నిత్యావసరాలపై కూడా జీఎస్టీ వేయడం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో జవ్వాది శ్రీను, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, మడకా రాజు, నరమాల కృష్ణ, చిటికిన రాము, పోతు శ్రీనివాసు, యడవల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గిడుగు పురస్కారం అందుకున్న వేమూరి



గిడుగు పురస్కారం అందుకుంటున్న వేమూరి శ్రీనివాసు

తాడేపల్లిగూడెం: పట్టణానికి చెందిన కవి వేమూరి శ్రీనివాసు గిడుగు వెంకట రామ్మూర్తి భాషా సేవా పురస్కారాన్ని అందుకున్నారు. మంగళవారం రాత్రి తెలుగు భాషా సంఘాల ఆధ్వర్యంలో విజయవాడలోని మంగళవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారం అందించారు ఎన్నిభాషలు విద్యలు నేర్చినా, మాతృభాష గొప్పతనాన్ని, మధురమైన తెలుగుభాషను, సాహిత్యాన్ని పరిరక్షించి భావితరాలకు అపురూపంగా అందించాలన్నారు.

సమస్యలపై చర్చించిన పీఈటీలు



పీఈటీల స్కూల్ కాంప్లెక్సు సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

తాడేపల్లిగూడెం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన నియోజకవర్గ స్కూల్ కాంప్లెక్సు సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు పలు విషయాలపై చర్చించారు. 35 మంది వ్యాయామ ఉపాధ్యాయులు ఏడు సెషన్స్‌గా జరిగిన ఈ సమావేశంలో వ్యాయామం, యోగా, ఖేలోఇండియా, ఆరోగ్యవిద్య, జాబ్‌చార్టు తదితర అంశాలపై చర్చించారు.హెచ్‌ఎం. ఎం.సత్యనారాయణ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంప్లెక్సు నియోజకవర్గ ఇన్‌చార్జి డి.శేఖర్‌బాబు, మండల ఇన్‌చార్జి ఎం.ఈశ్వర్, ఎంఈఓలు జి.కనకదుర్గ, టీవీ.రామకృష్ణ, ఏ.జ్యోతిలు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటు

సాక్షి, భీమవరం: భీమవరం రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం చిన్మయ ప్రభ ఆవరణలో జరిగింది. ముఖ్య అతిథిగా క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఇమిడి వెంకటరత్నం హాజరై మాట్లాడుతూ సమాజ సేవ చేయడానికి రోటరీ క్లబ్ ఒక మంచి వేదిక అని అన్నారు. భీమవరం రోటరీ క్లబ్ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా గుండు కిషోర్ , షేక్ బాబాజీ సాహెబ్, కోశాధికారిగా బొండా వెంకట సుబ్బారావు, ఉపాధ్యక్షునిగా అశ్మఖ లాల్ జైన్, జాయింట్ సెక్రెటరీగా వీవీఎస్ ప్రసాద్, 25 మంది నూతన సభ్యులతో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. నూతన సభ్యులకు అసిస్టెంట్ గవర్నర్ రోటరీ బ్యాడ్జీలు అందజేశారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో అనర్థం

- పెరిగిపోతున్న వినియోగం
- పేరుకుపోతున్న చెత్త
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పర్యావరణ వేత్తలు



పెంటపాడు మండలంలో దంపింగ్ యార్డులో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు



కె. పెంటపాడులో కోడివ్యర్థాలు, పాత సామాను వ్యర్థాలను తగుల బెడుతున్న దృశ్యం

పెంటపాడు: బయటకు వెళితే కాళ్లు కడుక్కొని ఇంట్లోకి వచ్చే మనం కాలుష్యాన్ని మాత్రం స్వయంగా ఇంట్లోకి కొనుక్కొని మరీ తెచ్చేసుకొంటున్నాం. చిన్నపాటి అశ్రద్ధ కారణంగా ప్రతీరోజు పదుల సంఖ్యలో క్యారీ బ్యాగులను వాడుతూ అటు పర్యావరణానికి, అంతిమంగా మానవ ఆరోగ్యానికి ముప్పు తెచ్చుకొంటున్నాం. గుడ్డతో తయారు చేసి చేతి సంచిని వినియోగిస్తే ఒక కుటుంబం రోజుకు పదికి పైగా ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వాడకాన్ని తగ్గించవచ్చు. కానీ ఆ దిశగా ఎవరూ ఆలోచించడం లేదు. దీంతో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వ్యర్థాలు కలిసి ఇవన్నీ గ్రామాల శివార్లకు డంపింగ్ యార్డులకు చేరుతున్నాయి. కొండల్లా పేరుకొంటున్న వీటిని వదిలించు క్రమంలో నిప్పు పెడుతున్నారు. తీవ్రమైన వాతావరణ కాలుష్యం ఏర్పడే క్రమంలో నిప్పుపెడుతున్నారు. దీంతో ఇంకా వాతావరణం వేడెక్కి కాలుష్యం మరింత పెరిగి చివరికి మన ఆరోగ్యానికి మనమే ముప్పు తెచ్చుకొంటున్నాం. ప్లాస్టిక్ నిషేదంపై ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకొంటున్నప్పటికీ అమలు చేయాల్సిన యంత్రాంగం మాత్రం నిర్లక్ష్యం చూపుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్లాస్టిక్ నిషేదం పల్లెలలో పూర్తిస్థాయిలో చేరక పోవడంతో పెద్ద ఎత్తున వినియోగం పెరిగిపోతోంది. ప్రధానంగా మండలంలో ముదునూరు చిలకంపాడు లాకులు, కె. పెంటపాడు బుడగా జంగాల పేట, పెంటపాడు కునాకరపేట, యానాలపల్లి గ్రామ శివారు అదే విధంగా పలు ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. బాగా పెరిగాక వాటిని తగుల బెడుతున్నారు. రోజు, విడిచి రోజు అయినా గ్రామాల శానిటేషన్ సిబ్బంది పట్టించుకోవడం లేదని ప్రజలు చెబుతున్నారు. కూరగాయలు, టిఫిన్లు ఇతర ఆహారపదార్థాలు ఇళ్లకు తెచ్చుకోవడానికి, పాలప్యాకెట్లు, డిస్పోజబుల్ ప్లేట్లు ఇలా ఉదయం నుంచి రాత్రి వరకు మనిషి ప్రతీ అవసరంలోనూ ప్లాస్టిక్ వస్తువులనే వినియోగిస్తున్నారు.

రోజూ 50 టన్నుల చెత్త

నియోజకవర్గంలో పెంటపాడు, గూడెం మండలాల్లోని గ్రామాల నుంచి నిత్యం సుమారు 50 టన్నుల వరకు చెత్త పోగవుతుందని ఒక అంచనా. ఇందులో సుమారు 3 టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయి. తడి పొడి చెత్త విషయంలో అలసత్వం వహిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తిరిగి ఉపయోగించుకోవాలన్న ఆదేశాలను భేఖాతరు చేస్తున్నారు.

చెత్తను తగల బెడితే ప్రమాదమే....

ప్లాస్టిక్ కాలిస్తే మరింత ప్రమాదమని హెచ్చరిస్తున్నప్పటికీ అన్ని రకాల చెత్తతో పాటే ప్లాస్టిక్‌ను కూడా తగుల బెడుతున్నారు. ఈ ప్రక్రియతో విపరీతమైన వాయుకాలుష్యం ఏర్పడుతోంది. శ్వాససంబంధ వ్యాధులతో ఇబ్బందులు పడే వారి సంఖ్య పెరగడానికి ప్రధాన కారణాల్లో ముఖ్యమైంది ప్లాస్టిక్‌ను మండించమే అని వైద్యులు కూడా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంపై ఎవరికి వారు అవగాహన పెంచుకోవాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ తగులబెట్టకుండా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టాల, నాయకులు చొరవ చూపాలని కోరుతున్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

ఇగవరం: దేవాలయాల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఇరగవరం మండలం తూర్పువిప్పర్రు గ్రామంలో శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి ఆలయనికి భూమి పూజ చేశారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తున్నమన్నారు. వీరభద్రస్వామి ఆలయ నిర్మాణం త్వరితిగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటి అధ్యక్షుడు సైపు రెడ్డి పెద్దిరాజు, గంజి సతీష్, మామిడిశెట్టి శ్రీను, సర్పంచ్ తమ్మిశెట్టి సత్యన్నారాయ ణ, ఆకేటి సత్యం తమ్మిశెట్టి రమేష్ ఆలయ అర్చకులు, ఆలయ కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ విధివిధానాలపై అవగాహన

కాళ్ల: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ను విద్యాశాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ నారాయణ సందర్శించారు. ఓపెన్ స్కూల్‌కు కాళ్ల హైస్కూల్ ఎంపిక కావడంతో బుధవారం ఆయన హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఓపెన్ స్కూల్ సంబంధించి విధి విధానాలను తెలియజేశారు. ఎంఈఓ కనకరాజు, కాళ్ల ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ గులాబ్ రాజ్ కుమార్ సిబ్బందికి ఓపెన్ స్కూల్‌లో చేరడం వల్ల వచ్చే సదుపాయాలను వివరించారు. మండల కేంద్రంలో విద్యాశాఖ కార్యాలయాన్ని సందర్శించారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- మోదుగ గుంటలో గడపగడపకు మన ప్రభుత్వం



తాడేపల్లిగూడెం మండలం మోదుగగుంటలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలోనే సంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ స్పష్టం చేశారు. బుధవారం రాత్రి మండలంలోని మోదుగ గుంట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత సచివాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ గత ఎన్నికల నాటికి... మరలా ఎన్నికలు సమీపించే నాటికి సీఎం జగన్‌పై ప్రజాదరణ పెరుగుతుందన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్ పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. అయితే, ఇవేమీ చంద్రబాబు, పవన్‌లకు పట్టడం లేదని విమర్శించారు. తిమ్మిని బమ్మిని చేసి ఏదో రకంగా ఓట్లు వేయించుకోవడానికి జగన్‌పై ఏ రకంగా బురదజల్లాలని చూస్తున్నారన్నారు. 2014–2019లో చంద్రబాబు లక్షల దొంగ ఓట్లు చేర్పించారన్నారు. బ్లూ ఫ్రాగ్‌కు ప్రభుత్వ సమాచారాన్ని అందించి దొంగ ఓట్లు చేర్పించి, వైఎస్సార్ సీపీ ఓట్లను తొలగించారని, దాన్ని అడ్డుకోవడం జరిగిందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎన్నికల కమిషన్ బూత్ స్థాయిలో అధికారులు, పార్టీ ఏజెంట్ల ద్వారా సర్వే చేస్తున్నట్టు తెలిపారు. దీంతో చంద్రబాబు చేర్పించిన దొంగ ఓట్ల తేలిపోతున్నాయన్నారు. దీంతో కొత్త నాటకం చంద్రబాబు ప్రారంభించాడన్నారు. చంద్రబాబు ఆలోచనలను ప్రజలు గుర్తించాలన్నారు. ఇదిలా ఉంటే పవన్ చంద్రబాబుకు భజన చేయడం, జగన్‌ను దింపేయాలని చూస్తున్నారన్నారు. తద్వారా నష్టపోయేది రాష్ట్ర ప్రజలని తెలిపారు. గత నాలుగేళ్ల మూడు నెలల కాలంలో రెండేళ్లు కరోనా మహమ్మారి ప్రపంచాన్ని గడగడ లాడించిందన్నారు. మిగిలిన రెండేళ్ల మూడు నెలల కాలం మాత్రమే జగన్ పాలన సాగించారన్నారు. కరోనా సమయంలో జగన్ పాలన దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. కాపు సామాజికవర్గాన్ని చంద్రబాబు మోసం చేశాడని, బీసీలకు తీరని అన్యాయం చేశాడన్నారు. 14 ఏళ్లల్లో మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఎంత మంది బీసీలను ఆదుకున్నారని నిలదీశారు. సామాజిక న్యాయం అంటే ఏంటో జగన్ చూపిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజలు మంచి ఆలోచన చేసి, తిరిగి జగన్‌ను ఎన్నుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, సర్పంచ్ కట్టా సత్యవతి, ఎమ్పీటీసీలు దండుబోయిన విజయదుర్గ, మార్లపూడి సుబ్బారావు, బుర్ల సుబ్బలక్ష్మి, తహసీల్దార్ వై.దుర్గాకిషోర్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, పీఆర్ డీఈ వేణుగోపాల్, హౌసింగ్ ఏఈ వైవి.వెంకట్రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఏఈ అల్లు రామకృష్ణ, డీడీవో ఆర్‌వీ.బ్రహ్మం, పంచాయతీ కార్యదర్శి మట్టా ప్రమీలా రాణి, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్; చిక్కాల సత్యనారాయణ, గుమ్మళ్ళ తాతారావు, సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్, నాయకులు కామన చంద్రరావు, కట్టా జానకీరామయ్య, వల్లేపల్లి సత్యనారాయణ, చిల్లిముంతల మారియ్య, ఏపూరి సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్

ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం: మహిళలకు రక్షణగా, మహిళా పక్షపాతిగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పరిపాలన ఉందని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం క్యాంపు కార్యాలయంలో బ్రహ్మకుమారీలు మంత్రికి రాఖీ కట్టి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో సోదరీ,సోదర బంధానికి ప్రతీక రాఖీ అన్నారు. ప్రతీ ఒక్కరూ ఒకరికొకరు రక్షణగా ఉంటూ సోదర సౌభ్రాతృత్వాన్ని చాటాలన్నారు. సీఎం అక్క, చెల్లెమ్మలకు రక్షణగా, అండగా ఉంటున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన వెంటనే మహిళలకు స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు, నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించారని చెప్పారు. సున్నా వడ్డీ సౌకర్యం మహిళలకు కల్పించారని చెప్పారు. ప్రజాపిత బ్రహ్మకుమారీ ద్వారా జరిగే కార్యక్రమాల గురించి వివరించారు. మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ కర్రి భాస్కరరావు, వైసీపి యువనేత కొట్టు విశాల్, బ్రహ్మకుమారీ కేంద్ర నిర్వాహకులు రమాదేవి, దీప.కుమారి, సాహిత్య,సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా ఉంటాం

తణుకు టౌన్: రాఖీ పౌర్ణమి (రక్షా బంధన్) సందర్భంగా పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుకు తణుకు ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి సునంద రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం వేల్పూరులోని సునంద నివాసానికి వెళ్లిన మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుకు సునంద శాలువాతో సత్కరించారు. అనంతరం రాఖీ సందర్భంగా మంత్రికి రాఖీ కట్టారు. అనంతరం వివిధ అంశాలపై చర్చించారు.

స్వచ్ఛ సంకల్పాన్ని పగడ్బందీగా నిర్వహించాలి

పెంటపాడు: గ్రామాల ఆరోగ్యం కోసం ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ సంకల్పాన్ని ఆయా గ్రామాలు కచ్చితంగా పాటించాలని ఈవోపీఆర్డీ ఎన్‌వీ ప్రసాద్ పేర్కొన్నారు. స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా రెండు రోజుల నుండి వచ్చిన సుమారు 3600 తడి, పొడి చెత్తల డబ్బాలను ఆయా గ్రామాలకు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ మాట్లాడుతూ పంచాయతీలు ఘన వ్యర్థాల నిర్వహణలో భాగంగా తడి, పొడి చెత్తలను ఇంటివద్దే ఎరువుగా మార్చుకొనే విధానాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. పొడి చెత్తను క్లాప్ వాహనాల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలనుపరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిశుభ్రత పాటిస్తే దోమలు దరి చేరవన్నారు. నివసించే పరిసరాల వద్ద నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. అక్కడ ఎరువు తయారు చేసి దాని ద్వారా ఆదాయాన్ని రాబట్టుకొనేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు గ్రామ కార్యదర్శి రామారావు, సచివాలయ అడ్మిన్ శ్రీనివాస్, ఆయా గ్రామాల కార్యదర్శులు రామకృష్ణ, భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.



పెంటపాడు మండల కార్యాలయానికి చేరిన చెత్త డబ్బాలను గ్రామాలకు పంపిణీ చేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల పాలకమండలి డైరెక్టర్‌గా 'గంటి'



డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చిన సర్వేశ్వరరావు

తాడేపల్లిగూడెం రూరల్: ద్వారకాతిరుమల దేవస్థానం పాలకమండలి డైరెక్టర్‌గా తాడేపల్లిగూడెం మండలం పట్టింపాలెం గ్రామానికి చెందిన గంటి చిన సర్వేశ్వరరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి, కృతజ్ఞతలు తెలిపారు. దేవస్థానం అభివృద్ధికి కృషి చేయాలని డిప్యూటీ సీఎం కొట్టు సూచించారు. అలాగే సర్వేశ్వరరావుకు జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాట్ల ప్రసాదరాజు, పెనుమత్స సూరపారజు, గంటి ప్రసాద్, పూడి సత్యనారాయణ, కాసగాని వెంకటేశ్వరరావు, బి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

సాక్షి, భీమవరం: ఇద్దరు వ్యక్తులు గొడవపడుతుండగా మధ్యలో వెళ్లిన మరొకరికి గాయాలైన ఘటన ఇది. పట్టణంలోని సుంకర పద్దయ్య వీధికి చెందిన నమ్మి శ్రీను మంగళవారం రాత్రి కొత్త బస్టాండ్ వద్దకు వెళ్లగా అక్కడ పిల్లి ఏసు, ఒక ఆటో డ్రైవర్ గొడవపడుతున్నారు.దీంతో శ్రీనుకు తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

ముదునూరుపాడు రామాలయానికి శంకుస్థాపన

పెంటపాడు: ముదునూరుపాడు బాలవెంకటేశ్వర స్వామి వారి ఆలయం వద్ద పురాతన దశలో ఉన్న రామాలయం నూతన నిర్మాణం కోసం బుధవారం శ్రీ రామమందిర పునఃనిర్మాణకమిటీ ఆధ్వర్యంలో భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తి గోపాలకృష్ణారెడ్డి, సంధ్యారాణి దంపతులు ఆలయ శంకుస్థాపన కోసం పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్మించబోయే ఈ ఆలయానికి రూ. 25 లక్షలు పైగా ఖర్చవుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. గత రెండు రోజుల క్రితం ఈ ప్రాంతంలో గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇక్కడకు విచ్చేసిన ఉపముఖ్యమంత్రి, దేవాదాయశాఖామంత్రి కొట్టు సత్యనారాయణ గ్రామస్తుల అభ్యర్థన మేరకు రూ. 10 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారని వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి జనార్ధన రెడ్డి తెలిపారు. మంత్రి కొట్టు సత్యనారాయణకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. మేడపాటి జనార్ధన రెడ్డి, సత్తి వెంకట జగన్ మోహన్‌రెడ్డి, విజయభాస్కరరెడ్డి, కర్రి రవికుమార్‌రెడ్డి, ద్వారంపూడి ప్రేమ్‌కిరణ్‌రెడ్డి, పులగం వెంకటరెడ్డి, సత్తి వేణుగోపాలరెడ్డి, వెంకట్రామిరెడ్డి, నారాయణరెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి, తాడి రామ్మోహనరెడ్డి, దాసరి ప్రసాద్, గుడిమెట్ల శ్రీనివాసరెడ్డి తదితరులు, కమిటీ పెద్దలు, గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడు సుదర్శనం వేంకట సీతారామశేషాచార్యులు భక్తులతో ప్రత్యేక శంకుస్థాపనలో ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ యువనాయకుడు కొట్టు విశాల్ ఈ సందర్భంగా ఆలయ పునఃనిర్మాణ కమిటీ సభ్యులను అభినందించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



తుందుర్రులో శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్

భీమవరం అర్బన్: సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని తుందుర్రు గ్రామంలో బుధవారం మేలైన వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవిలో వరి పొలాలను రెండు లోతు దుక్కులు దున్నుకోవాలన్నారు. చీడపీడలు తట్టుకునే వరి వంగడాలను పంటకు ఎంచుకోవాలన్నారు. ఎకరానికి 4 టన్నుల పశువుల పేడను దుక్కుల్లో వేయాలన్నారు. పచ్చిరొట్ట సాగు చేసి దమ్ము చేస్తే భూసారం పెరుగుతుందన్నారు. కిలో విత్తనాలకు 10 గ్రాముల సూడోమోనాస్ లేదా 3 గ్రాముల కార్బన్‌డిజంతో విత్తన శుద్ధి చేస్తే తప్పలు తాళ్లు వేచ్చే అవకాశాలు ఉండవన్నారు. వరినారి చివర కొనలు తుంచి నాటితే కాండం తొలుచు పురుగును నివారించవచ్చన్నారు. వరి నారిని పైపైన నాటితే పిలకలు వేసి వరి దుబ్బు చేస్తుందన్నారు. మురుగునీటిని బయటకు పంపే సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎకరానికి నత్రజని 32–36 కిలోలు, భాస్వరం 24 కిలోలు, పొటాషియం 16–24 కిలోల మధ్య వేయాలన్నారు. సమగ్ర కలుపు యాజమాన్యం, నీటి యాజమాన్యం, ఎలుకల నివారణ, కోత దశలోను సస్య రక్షణ చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. సర్పంచ్ ఆరేటి వెంకట సత్య వీరాస్వామి నాయుడు (పెద్దబ్బు), డీఆర్‌సీ వ్యవసాయ అధికారిని జి.బాల నాగేశ్వరమ్మ, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరిస్తున్న డివైఈఓ, తదితరులు

తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2022–23 విద్యాసంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థులకు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా డివైఈఓ రవీంద్రభారతి మాట్లాడుతూ నూటికి నూరుశాతం మార్కులు సాధించడం పట్ల తాడేపల్లిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. అధికశాతం మార్కులు పొందిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ప్రశంసలందించారన్నారు. ఈసందర్భంగా రాయుడు అనూష, పొద్దూరి దేవిశ్రీ రమ్య మెహర్, బుద్దాల షణ్ముక సాయి, వెలిశెట్టి చరణ్‌తేజ, పెనుమాక హేమలను ఘనంగా సత్కరించి మెమెంటోలను అందచేశారు. ప్రధానోపాధ్యాయులు ఎం సత్యనారాయణ అధ్యక్షత వహించగా ఉపాధ్యాయులు కేవీ గణపతి పాల్గొన్నారు.

దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్



తాడేపల్లిగూడెం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ పరిధిలోని దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్‌లు, కంప్యూటర్ ఆపరేటర్‌లు బుధవారం పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దస్తావేజుల లేఖర్ల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బిఎస్‌వి సుబ్బారావు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ నూతనంగా ప్రవేశపెడుతున్న ప్రైమ్ 2.0 విధానం వల్ల ప్రజలు, లేఖర్లు ఇబ్బందులు పడే అవకాశం ఉందని, దీనిని నిరసిస్తూ రాష్ట్ర దస్తావేజు లేఖర్లు సంక్షేమ సంఘం పిలుపు మేరకు 30, 31 తేదీలలో రెండు రోజుల పాటు పెన్‌డౌన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా బుధవారం పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పెదగాడి సూర్యం, రుద్రరాజు సునీత, తాడేపల్లి ధనరాజు నియోజకవర్గంలోని స్టాంపు వెండర్లు, లేఖర్లు పాల్గొన్నారు.